క్లుప్తంగా

ఫ్యాక్టరీ డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామ సమీపంలోని సిమెంట్ కర్మాగారంలోగల డంపింగ్ యార్డులో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. డంపింగ్ యార్డులో మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో కర్మాగారం సిబ్బంది జగ్గయ్యపేట అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫైర్‌సిబ్బంది మంటలను అదుపు చేశారు. డంపింగ్ యార్డులో పాత సామాగ్రి దగ్ధమైందని ఫైర్ సిబ్బంది తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



వత్సవాయి : ఆర్యవైశ్య జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య కుటుంబాల వారికి ఆదివారం నిత్యావసర సరుకులను సంఘ ప్రధాన కార్యదర్శి గుర్రం కృష్ణవేణి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 17 కుటుంబాల వారికి రూ.34వేల విలువ చేసే సరుకులను జిల్లా అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు చేతుల మీదుగా అందజేశారు. మిట్టపల్లి వంశీ కృష్ణ, గీతావాణి, పసుమర్తి సంతోష్‌పావని, కోటిలింగాల ఆలయ పురోహితులు తేజ ఆర్థిక సాయంతో అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రాజారావు మాట్లాడుతూ పేదలకు అందరూ తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మోటమర్రి లక్ష్మి, గుర్రం మోహన్‌రావు, చిన్న సత్యంబాబు, కొత్తమాసు రామారావు, సూరే శ్రీదేవి, పద్మావతి, కృష్ణకుమారి, యర్రా పద్మా, బొగ్గవరపు రమాదేవి, దుగ్గి శైలజ, ఉష తదితరులు పాల్గొన్నారు.

149 మద్యం సీసాలు స్వాధీనం



జగ్గయ్యపేట: తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ మణికంఠరెడ్డి ఆదివారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం..ఎస్‌ఈబీ పోలీసులు మండలంలోని తక్కెళ్లపాడు గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం 149 సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మైలవరం మండలం జీ కొండూరు గ్రామానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. కొండూరుకు చెందిన తాతా రాజేష్, గోపి, బళ్లా ఫణీంద్రలను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ. 1.62 లక్షలు ఉంటుందని ఎస్‌ఈబీ సీఐ తెలిపారు.

నిర్మానుష్యంగా రహదారులు



నందిగామ: ఏప్రిల్ ప్రారంభంతోనే ఎండలు మండుతున్నాయి. నిన్న మొన్నటి వరకు ఒక మాదిరిగా ఉన్న ఎండలు గత రెండు రోజులుగా మరింత పెరిగాయి. వాతావరణశాఖ అధికారుల లెక్కల ప్రకారం శనివారం నందిగామ ప్రాంతంలో పగటి ఉష్ణోగ్రతలు 40.6 నమోదు కాగా రాత్రి ఉష్ణోగ్రతల సైతం 25.4 డిగ్రీలు గా నమోదయ్యాయి. నందిగామ పట్టణంలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు 39.6 డిగ్రీలు నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతల సైతం 25.1 డిగ్రీలు నమోదయ్యాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉంటుండటంతో దాదాపు సాయంత్రం ఐదు గంటల వరకు ప్రధాన రహదారులు సైతం నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పిఠాపురానికి చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. పిఠాపురంకు చెందిన ఎన్. సత్యనారాయణ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలు అందచేశారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్ : క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) పండుగ వేడుకలను జగ్గయ్యపేట పట్టణ, మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చిలో డీసరీ చైర్మన్ రెవరెండ్ ఎస్.పాల్‌రాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎవాంజలిస్ట్ డి.విజయలక్ష్మి, చర్చి కమిటీ ప్రతినిధులు, ఉమెన్స్ ఫెలోషిప్, సండే స్కూల్, యూత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ గుడిసె జయరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైవై కాలనీలోని కాలేజ్ ఆఫ్ బైబిల్ టెక్నాలజీ(క్రైస్ట్ చర్చి)లో పాస్టర్ ఎ.విజయరావు ఆధ్వర్యంలో, కోదాడ రోడ్డులోని బేతెస్థ ప్రార్థనా మందిరం, బలుసుపాడు రోడ్డులో బేతేలు చర్చిలో బిషప్ జాన్‌బాబు, విలియంపేట జి.జి.ఎఫ్ మినిస్ట్రీ చర్చిలో ఎస్.జోసఫ్‌కిరణ్ ఆధ్వర్యంలో, క్రిస్టియన్‌పేట, విలియంపేట సీఎస్ఐ చర్చిల్లో డీసీలు గంధం రవి, దర్శన్‌సుందర్, సెయింట్ ఆన్స్ చర్చిలో సిస్టర్స్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని బలుసుపాడు గ్రామంలో ఆర్‌సీఎం, సీఎస్ఐ, డీసీఎం, ఎల్లడ, సెవెంత్‌డే అడ్వాంటిస్ట్ తదితర చర్చిలలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విప్ ఉదయభాను ప్రత్యేక ప్రార్థనలు..

ఈస్టర్ పండుగ సందర్భంగా పేట పట్టణంలోని కోదాడ రోడ్‌లో ఉన్న బేతస్థ ప్రార్థనా మందిరంలో రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సోదరులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పణితి విజయకుమార్, అన్నెపాగ నరసింహారావు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): ఈస్టర్ వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చీకటిపై విజయం సాధించే వెలుగు ఈస్టర్ అని ముచ్చింతాల చర్చి ఫాదర్ దేవకుమార్ అన్నారు. ఈస్టర్ సందర్భంగా స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుప్రభువు గీతాలు ఆలపించటం, దివ్య ప్రసాదం పంపిణీ చేశారు. కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తు పునరుత్థాన పుణ్యదినానికి స్వాగతం పలికారు. ఉపవాస దీక్షలు విరమించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: క్రీస్తు పునరుత్థాన పండుగ (ఈస్టర్)ను నందిగామ డివిజన్‌వ్యాప్తంగా క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక వేళంగిణి మాత చర్చిలో దివ్య సత్ప్రసాద ఆరాధనతో ఈస్టర్ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువు కమతం మరియదాసు ప్రత్యేక దివ్య బలి పూజ సమర్పించారు.పట్టణంలోని పలు చర్చిలు, మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండల ప్రజలు ఈస్టర్‌ను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని చిల్లకల్లులో ఉన్న న్యూహోప్, ఆల్‌సెయింట్స్ చర్చిలతో పాటు జయంతిపురం, గండ్రాయి తదితర గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : ఈస్టర్ పర్వదినం సందర్భంగా మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం భక్తులు, విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కంచికచర్ల ఆర్‌సీఎం, సీఎస్ఐ చర్చిలతోపాటు మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాల్లో క్రీస్తు పునరుత్థానుడైన సందర్భంగా భక్తులు ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ పేరం దత్తు దైవసందేశం ఇచ్చారు. గండేపల్లి సీఎస్ఐ చర్చి దేవాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ ఎం.జాన్‌కోటేశ్వరరావు, క్రైస్తవులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ పండుగ వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆయా గ్రామాల్లోని చర్చిలు, నిత్యసహాయమాత, పరిశుద్ధ లూర్దుమాత ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పొన్నవరంలోని గ్రేస్‌బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్లు గొర్రెపాటి రత్నం, ఇమ్మానియేలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, షోడగిరి సతీష్, భక్తులు పాల్గొన్నారు.

బోడవాడ–జమ్మవరంలో..

మండలంలోని బోడవాడ-జమ్మవరం విచారణ పరిధిలోని పరిశుద్ధ లూర్దుమాత ఆలయంలో ఈస్టర్ పండుగ సందర్భంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు, దివ్య బలిపూజ చేశారు. ఈ సందర్భంగా రెవ.ఫాదర్ సాలే వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభువు క్రీస్తు చూపిన మార్గం సకల మానవాళికి ఆచరణీయమని బోధించారు. ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు నన్నెబోయిన తిరుమలరావు, యాదాల దాసు, కర్ల రాణి, కర్ల రాజు, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా జగన్నాధపురంలోని నిత్య సహాయమాత ఆలయంలో ఫాదర్ సుగుణరావు మాట్లాడుతూక్రీస్తుజీవితం అందరికీ ఆదర్శ ప్రాయమన్నారు. జీసెస్ చూపిన మార్గంలో అందరూ నడుచుకోవాలని సూచించారు. ప్రార్థనల్లో సర్పంచి బండి విజయ్‌పాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జ్ఞానారెడ్డి, నరసింహారెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



పేట బెతెస్థ చర్చిలో క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న విప్ సామినేని ఉదయభాను



ముచ్చింతాలలో ప్రార్థనలకు హాజరైన భక్తులు



పేట సీఎస్ఐ టౌన్ చర్చిలో ఈస్టర్ ప్రత్యేక గీతాలను ఆలపిస్తున్న యూత్ సభ్యులు



నందిగామ ఆర్‌సీఎం చర్చిలో దివ్య బలిపూజ నిర్వహిస్తున్న గురువులు



బోడవాడ-జమ్మవరం లూర్దుమాత ఆలయంలో సందేశమిస్తున్న ఫాదర్ సాలే వినయ్‌కుమార్



గండేపల్లిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నేడు వడ్డెర ఆత్మీయ సమావేశం



జగ్గయ్యపేట అర్బన్: వత్సవాయి మండలం మక్కపేటలోని ఎస్‌కేఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం పదిగంటలకు నిర్వహించే జగ్గయ్యపేట నియోజకవర్గ వడ్డెర ఆత్మీయ సభకు సంఘీయులంతా తరలిరావాలని ఆసంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక వడ్డెర సంఘం కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వేముల మల్లేశ్వరరావు, పార్టీ రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ తన్నీరు నాగేంద్ర, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు మాట్లాడుతూ ఆత్మీయ సమావేశం వివరాలను వివరించారు. ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు, పులివెందుల, మాచర్ల, నందిగామ మున్సిపల్ చైర్మన్లు వల్లెపు వరప్రసాద్, తురకా కిషోర్, ఓర్సు లక్ష్మి తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. ఆత్మీయ సమావేశానికి వడ్డెర్లంతా తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

పేదలకు ఉచిత భోజనం



జగ్గయ్యపేట అర్బన్: ఈస్టర్ పండుగ సందర్భంగా పేదలకు ఉచితంగా భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని స్థానిక సీతారామపురంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా)ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత భోజనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉదయభాను హాజరై పలువురికి భోజనాలు వడ్డించారు. ఇంటూరి చిన్నా సేవానిరతిని కొనియాడుతూ ఆయనను అభినందించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కఠారి హరిబాబు, పణితి విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేశా

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నందిగామ ప్రజల అవసరాలను గుర్తించి వారికి ఆయా సేవలు, అభివృద్ధిఫలాలను అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేశానని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎనిమిదో వార్డు రైతుపేట డౌన్ ప్రాంతంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికలలో తనకు మద్దతు పలికి మరోసారి తన విజయానికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వార్డు ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

భవిష్యత్‌లో మెడికల్ కళాశాల..

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గ ప్రజలకు మల్టీస్పెషాలిటీ స్థాయి మెరుగైన వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు 100 పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. ఈ ఆస్పత్రి భవిష్యత్‌లో నందిగామ వైద్యకళాశాలగా మార్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆస్పత్రి ఆవశ్యకతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి రూ.34 కోట్లను మంజూరుచేయడంతో శంకుస్థాపన చేసినట్లు వివరించారు. తమ హయాంలో వైద్యసేవలను ఇంటింటికీ చేరువ చేసినట్లు తెలిపారు. నందిగామ సర్వతోముఖాభివృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. నందిగామ అభివృద్ధి విషయంలో గత టీడీపీ పాలనను, తమ వైఎస్సార్ సీపీ పాలనను బేరీజు వేసుకోవాలని కోరారు. తనకు మరోసారి అవకాశం కల్పిస్తే నందిగామను మరింత అభివృద్ధిపథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, వార్డు కన్వీనర్ గుడివాడ సాంబశివరావు, నాయకులు మన్నెం దాసు, దొంతిమాల చంద్రశేఖర్, పిఎల్ నరసింహారావు, పాములపాటి రమేష్, షేక్ ఫాతిమ, షేక్ యాకుబ్ అలీ, సూరె రామారావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, రవికిరణ్‌రెడ్డి, బండారు వెంకట్రావ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎనిమిదో వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

విద్యార్థులపై సెల్‌ఫోన్ల ప్రభావం

కంచికచర్ల : సామాజిక మాధ్యమం రెండు వైపులా పదునైన కత్తిలాంటిది. ఆశయం దిశగా సాగితే విజ్ఞానం..వినోదం ఉంటాయి. ఏ మాత్రం గురితప్పినా జీవితం తారుమారవుతుంది. యువత మార్కెట్‌లోకి ఏ ట్రెండ్ వచ్చినా అందిపుచ్చుకుంటుంది. వాటిని అనుసరిస్తుంది. ఫేస్‌బుక్‌లో లైకులు, కామెంట్లు, వాట్సప్‌లో స్టేటస్‌లు ఇలా...యువత సామాజిక మాధ్యమాల ఊహల గగనంలో విహరిస్తోంది.

ఫేస్‌బుక్ అంటే క్రేజ్.....

ఫేస్‌బుక్ పేరు వింటేనే అందరిలో ఉత్సాహం మొదలవుతుంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఫేస్‌బుక్ దగ్గరైంది. యువత విషయంలో చెప్పాల్సిన అవసరం లేదు. ఫేస్‌బుక్ చూడటం, రీల్స్ చేసి ఫేస్‌బుక్‌లో పెట్టడం, వీడియోలు అప్‌లోడ్ చేయడం చేస్తుంటే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరు. ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోకపోతే మొదటికే మోసం వస్తుంది.

పరిమితి దాటితే ప్రమాదమే.....

సామాజిక మాధ్యమాలను రోజుకు 30నిముషాలకు మించి వినియోగిస్తే ఇబ్బందులు తప్పవని వైద్యులు అంటున్నారు. కాని చాలామంది గంటల తరబడి ఇందులోనే గడుపుతుంటారు. ప్రతిరోజూ వాటిని వినియోగించి ప్రస్తుతం పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నారు. అలాంటివారు తమకు తామే ఓ పరీక్ష పెట్టుకోవాలని వైద్యులు, నిపుణులు అంటున్నారు. ప్రతి పది నిముషాలకు ఒకసారి ఫోన్‌వైపునకు చేయి వెళ్లుతుందా... ఫేస్‌బుక్, వాట్సప్ చూడాలనిపిస్తుందా...అనే విషయాలు తమను తామే ప్రశ్నించుకోవాలి. పరిస్థితి చేయి దాటినట్లు భావిస్తే...వారం పదిరోజులు వాటికి దూరంగా ఉండేటట్లు ప్రయత్నించాలి. ఇలా ఉండకలిగితే నియంత్రణలో ఉన్నట్లే లెక్క. ఉండకపోతే వాటికి బానిస అయినట్లేనని నిపుణులు చెబుతున్నారు.

మానసిక రుగ్మతలు.....

ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్ ఇతర సామాజిక మాధ్యమాలకు అలవాటు పడిన వారిలో మానసిక రుగ్మతలు పెరుగుతున్నాయని మానసిక వైద్యులు, సైకాలజిస్టులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ప్రస్తుతం చాలామందికి సెల్‌ఫోన్ ఒక వ్యసనంగా మారుతోందని , ఆ పరిస్థితి మారాలనివారు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఫేస్‌బుక్‌లో రీల్స్ అనేక ప్రయోగాలు చేయటం కామెంట్లు లైకులు వస్తే ఆనందపడటం, వ్యతిరేకంగా కామెంట్లు చేస్తే బాధకు లోనవుతున్నారు. రోజులో కొద్ది సమయం తప్పితే అదేపనిగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే కంటి సమస్యలు, మానసిక రుగ్మతలు తప్పవని వైద్యులు అంటున్నారు. సామాజిక మాధ్యమాల విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండి, లక్ష్యసాధనపై దృష్టిపెట్టాలని వారు సూచిస్తున్నారు.



కంటిచూపుపై ప్రభావం..



ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే కంటిచూపుపై ప్రభావం పడుతుంది. దీనివలన రెటీనా పొర దెబ్బతింటుంది. కంటిచూపు మందగించడంతోపాటు ఎముకల సమస్యలు వస్తాయి. ఆరోగ్యం క్షీణిస్తుంది. సెల్‌ఫోన్ అతి వినియోగం మంచిదికాదు.

– డాక్టర్ కె.మధురిమ, కంచికచర్ల పీహెచ్‌సీ

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి : డీసీపీ



పెనుగంచిప్రోలు: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు విజయవాడ రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టంచేశారు. ఆయన వెంట నందిగామ ఏసీపీ రవికిరణ్, సీఐలు జానకీరామ్, పి.చంద్రశేఖర్, ఎస్ఐ పి.రాంబాబు తదితరులు ఉన్నారు.

పెనుగంచిప్రోలులో ఉద్రిక్తత

పరిస్థితిని అదుపుచేసిన పోలీసులు



పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. డౌన్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన దాడిలో నలుగురికి గాయాలవ్వగా, వీరిలో ఓవ్యక్తి తీవ్రగాయాలతో విజయవాడలో చికిత్స పొందుతున్నాడు. అర్ధరాత్రి వరకు దాడికి పాల్పడిన వ్యక్తులను తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ ఎస్సీ కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక బలగాలు, సాయిధ పోలీసులతో ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ డీసీపీ కె శ్రీనివాసరావు, ఏసీపీ రవి కిరణ్, సీఐలు జానకిరామ్, పి.చంద్రశేఖర్, ఐవీ నాగేంద్రకుమార్, ఎస్ఐ పి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో పలువురు యువకుల మత్తుపానీయాలు, పదార్థాలకు అలవాటుపడి స్పీడ్ డ్రైవింగ్ చేస్తూ యువతులను అల్లరి చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

మంగొల్లు(వత్సవాయి) : మండలంలోని మంగొల్లు గ్రామ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు బొల్లం హనుమంతరావు ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, హనుమంతరావుకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేశానని తెలిపారు. క్రమేపీ ఆపార్టీ విధివిధానాలు సజావుగా లేకుండాపోతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల వారికి సమానమైన న్యాయం అందిస్తూ సంక్షేమ పాలన అందిస్తుండటం నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. కష్టపడి పనిచేసేవారికి టీడీపీలో గుర్తింపు లేదన్నారు. గ్రామంలో పార్టీ బలోపేతంకు తనవంతుగా కృషిచేస్తానని ఉదయభానుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, సొసైటీ అధ్యక్షులు సామినేని లక్ష్మీనారాయణ, గ్రామ నాయకులు అన్నెపాక నరసింహరావు, శరణం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



హనుమంతురావును ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను

క్రీడలతో మానసికోల్లాసం

జగ్గయ్యపేట అర్బన్: క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం స్థానిక క్రిస్టియన్‌పేటలో ఇటీవల నిర్వహించిన క్రికెట్, వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి తుమ్మల ప్రభాకర్ వితరణతో ఇచ్చిన ప్రైజ్‌మనీ రూ.20వేలును ఆయా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు అందజేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ పేట నియోజకవర్గంలో క్రీడలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారని తెలిపారు. క్రిస్టియన్ పేటలోని క్రీడాకారులకు తమ వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోగుల వెంకయ్య, ముత్యాల జార్జి, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్

కళాకారులు సాంస్కృతిక రాయబారులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులని టీవీ నటుడు అప్పారావు అన్నారు. జేఎమ్ఎస్ సరాగాలు ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళా వేదికమీద ఆదివారం సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అప్పారావు మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సీనియర్ గాయకుడు కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ గాయకులకు, కళాకారులకు వేదిక కల్పించాలని సూచించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గాయని ఝాన్సీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

